క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు సత్కారం



కూళ్లలో పారిశుధ్య కార్మికులను సన్మానించిన ప్రజాప్రతినిధులు

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల వద్ద బుధవారం పారిశుధ్య కార్మికులకు సత్కారం నిర్వహించి ఘనంగా సన్మానించారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల వద్ద ఎంజీఎన్ఆర్‌జీఎస్ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి పారిశుధ్య కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషించే కార్మికులను శాలువాలు, పూలదండలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందించారు. కూళ్ల పంచాయతీ వద్ద జరిగిన సమావేశంలో ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు పాల్గొని పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్లకార్డులతో పారిశుధ్యం మెరుగు పడాలని ర్యాలీ నిర్వహించారు.

'పొలం పిలుస్తోంది'ని సద్వినియోగం చేసుకోవాలి



వెంకటాయపాలెంలో రైతులకు పోస్టర్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఏఓ, పశు వైద్యులు

రామచంద్రపురం రూరల్: రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ కోరారు. మండలంలోని వెంకటాయపాలెం, వేగాయమ్మపేట గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాల గురించి, పంటకాలువల పూడికతీత గురించి, ధాన్యం కొనుగోలు అంశాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున మాట్లాడుతూ పశువుల్లో వచ్చే వ్యాధులు, నివారణకు చేపట్టాల్సిన చర్యలు వివరించారు. రాయితీపై పశువుల షెడ్ల నిర్మాణం అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఉప సర్పంచ్ వనుం గోవిందరాజు, రైతులు బొమ్ము బాలకృష్ణ, పితాని వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష



ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మండపేట: గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ ఉపాధ్యాయులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో యూపీ, హైస్కూల్ ఉపాధ్యాయులంతా సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి నేతృత్వంలో కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు ప్రాంతాల నుంచి 70 మంది ఉపాధ్యాయులు గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. తొలుత మహనీయుని జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ ఆడిట్ కమిటీ కన్వీనర్ డీవీ రాఘవులు విచ్చేసి మాట్లాడారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలన్నారు. యూపీ, హైస్కూల్, ఎస్‌జీటీ, పండిట్ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి బదిలీలు జరపాలన్నారు. పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే దశల వారీగా పోరాటాన్ని సాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పి.రామచంద్రారెడ్డి, ఎం.శ్రీనివాస్, సీహెచ్‌వీవీ సత్యనారాయణ మూర్తి, వారా లక్ష్మి, కె.సత్తిబాబు, జి.రాజు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు వారా లక్ష్మి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.రాజు, జువ్వల శ్రీనివాస్, కె.సూరిబాబు పాల్గొన్నారు.

ఆ పోలీస్‌స్టేషన్‌కు ఏమైంది..?

- నెల తిరక్కుండానే ఇద్దరు ఎస్సైల అవుట్
- ఒక రోజు ఎస్సైగా మిగిలిన శ్రీనివాస్
- వచ్చిన ఇద్దరూ వీఆర్‌కు..
- అవాక్కవుతున్న కూటమి నేతలు, ప్రజలు



రామచంద్రపురం పోలీస్‌స్టేషన్



పి.వాసు, ఎస్సై



ఎస్.శ్రీనివాస్, ఎస్సై

రామచంద్రపురం: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అసలు ఏం జరుగుతోంది..? ఒక నెలలో ఇద్దరు ఎస్సైలు బాధ్యతలు తీసుకుని పీఛేముడ్ ఎందుకు తీసుకున్నారు..? నియోజకవర్గ అమాత్యుల వారికి ఆ ఎస్సైలు తెలియకుండానే వచ్చారా..? ఒక సర్కిల్ పోలీస్ అధికారి తనకు నచ్చిన ఎస్సై కోసం చక్రం తిప్పుతున్నారా...? అనే ప్రశ్నలు పట్టణ వాసులతో పాటుగా కూటమి నేతల్లోనూ ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రామచంద్రపురం పట్టణ స్టేషన్‌లో గత నెల రోజులుగా జరుగుతున్న పరిణామాలు చర్చాంశనీయాంశంగా మారాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత బదిలీలు సర్వసాధారణం. తమకు ఇష్టమైన అధికారులను అధికారంలో ఉన్న వారు నియమించుకోవడం పరిపాటి. స్థానికంగా ఉన్న మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇచ్చిన సిఫారసు లేఖ మేరకు సెప్టెంబర్ ఒకటిని పాటి వాసు రామచంద్రపురం ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం అదే నెల 5న రామచంద్రపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కడియాల అశోక్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఏం జరిగిందో ఏంటో తెలియదు కానీ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై వాసు మీద అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి టీడీపీ అధిష్టానం వద్ద గతంలో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన వాసును రామచంద్రపురంలో ఎలా ఎస్సైగా వేసుకున్నారని ఫిర్యాదు చేయటంతో వాసును వచ్చిన వారం రోజులకే వీఆర్‌లోకి పంపించేశారు. తన నియోజకవర్గంలో తన అనుమతితో వాసును నియమించినా వీఆర్‌లోకి పంపేస్తున్న సమయంలో మంత్రి సుభాష్ కిక్కురుమనకుండా ఉండటం చర్చకు దారి తీసింది. ఇది జరిగిన సరిగ్గా 20 రోజులకు సెప్టెంబర్ 28న గతంలో ఆత్రేయపురం ఎస్సైగా బాధ్యతలు నిర్వహించి వీఆర్‌లో ఉన్న ఎస్.శ్రీనివాస్ రామచంద్రపురం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న మరుక్షణం నుంచి ఆయన విధులు నిర్వహిస్తూ అదే రోజు డంక్ అండ్ డ్రైవ్‌లో పాల్గొన్నారు. మరుసటి రోజు ఉదయమే ఎస్సై శ్రీనివాస్‌ను వెనక్కి రావాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీనివాస్ తిరిగి వీఆర్‌లోకి వెళ్లిపోయారు. అసలేం జరిగిందో ఏంటో గాని ఒక్క రోజు మాత్రమే విధులు నిర్వహించిన శ్రీనివాస్ తిరిగి వీఆర్‌లోకి వెళ్లిపోయారు. సరిగ్గా నెలంటే నెల రోజుల్లో ఇద్దరు ఎస్సైలు రామచంద్రపురం వచ్చి ఇద్దరు కూడా వీఆర్‌లోకి వెళ్లిపోవటం పోలీసు వర్గాలను సైతం విస్మయానికి గురిచేసింది. అయితే రెండో ఎస్సైగా వచ్చిన శ్రీనివాస్ గతంలో రాజమహేంద్రవరంలో విధులు నిర్వహిస్తున్న ఒక ఎస్సైకు అత్యంత సన్నిహితుడని, ఆ ఎస్సై నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీకి చెందిన ఒక నేతకు దగ్గర బంధువు అనే నెపంతో శ్రీనివాస్‌ను వీఆర్‌లోకి పంపించేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా ఎస్సై శ్రీనివాస్ కూడా మంత్రి సుభాష్ ఆశీస్సులతోనే ఇక్కడకు వచ్చి బాధ్యతలు స్వీకరించగా వీఆర్‌లోకి పంపినట్లు కూడా మంత్రికి తెలియదని కూటమి నేతలే చెప్పుకోవడం కొసమెరుపు. అయితే తనకు అనుకూలంగా ఉండే ఎస్సైను ఇక్కడ నియమించుకోవాలని ఒక అధికారి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఇలా ఎస్సైలను తిరిగి ఏదో నెపంతో పంపించేస్తున్నారనే అనుమానాలను అటు పోలీసులు, ఇటు కూటమి నేతలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే మొట్టమొదటిగా తాను సిఫారసు లెటర్ ఇచ్చిన తరువాత విధుల్లో చేరి వీఆర్‌లోకి వెళ్లిపోయిన పి.వాసునే తిరిగి ఇక్కడకు రప్పించుకునేందుకు మంత్రి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా గతంలో ఎన్నడూ జరగని విధంగా పోలీసు అధికారుల నియామకంలో మంత్రితో పాటుగా అధికార పార్టీ నేతలు తమ పట్టును కోల్పోయారనే విమర్శలు మాత్రం వినిపిస్తున్నాయి.

తాతపూడి కార్యదర్శికి సన్మానం



తాతపూడిలో కార్యదర్శి మోహన్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: బదిలీపై వెళ్తున్న తాతపూడి గ్రామ కార్యదర్శి మోహన్‌ను ప్రజలు బుధవారం సత్కరించారు. మోహన్ నేలటూరు కార్యదర్శిగా వెళ్తున్నారు. రెండేళ్లపాటు కార్యదర్శిగా ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఉప సర్పంచ్ గుత్తుల సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి శ్రీనివాస్, నాయకులు వాసంశెట్టి సాయిబాబు, మేకా శ్రీధర్, జగ్గంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

మహాయజ్ఞంలా మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిన వాసవీ క్లబ్ మహిళలు

మండపేట: పర్యావరణ హితం కోసం వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కోటి మొక్కలు నాటే మహా యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం క్లబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని వైద్యుడు రాము ప్రారంభించారు. తొలుత బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహానికి వారంతా పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం 10 వేల విత్తనాలు, సీడ్ బాల్స్‌ను రహదారుల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో చల్లారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ వాసవీ క్లబ్ చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం ఎంతో గొప్పదని కొనియాడారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ కోటి మొక్కలు నాటాలని బలమైన సంకల్పంతో కార్యక్రమం చేపట్టామని, తయారు చేసిన సీడ్ బాల్స్ అటవీ ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలు, రహదారుల పక్కన, కొండ ప్రాంతాల్లో వేస్తామని తెలిపారు. ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ బోడా వీర్రాజు, క్లబ్ అధ్యక్షురాలు కాళ్లకూరి శాంతి, కార్యదర్శి బోనగిరి రమణి, కోశాధికారి పెరుమాళ్ల మహాలక్ష్మి, సభ్యులు వాకచర్ల వాసంతి, పెరుమాళ్ల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్య సంకల్పకర్త గాంధీజీ

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ సూర్యప్రకాశ్
- ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన సూర్యప్రకాశ్ తదితరులు



రాయవరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తదితరులు



అయితపూడిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు



ఏడిదలో మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ప్రభాకరరావు

రామచంద్రపురం: గ్రామ స్వరాజ్య స్థాపనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని.. గాంధీజీ చూపించిన మార్గంలో గత ఐదేళ్ల పాటు రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. గాంధీజీ జయంతి పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అహింసా మార్గంలోనే ప్రతి సమస్యను పరిష్కరించుకోవచ్చని అప్పట్లోనే ప్రపంచ దేశాలను చాటి చెప్పిన మహాత్ముడు గాంధీజీ అని కొనియాడారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం చైర్ పర్సన్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం తదితర పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్లు కోలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్‌లు వాడ్రేవు సాయిప్రసాద్, తోట అమ్మాజీ, కమిషనర్ బి.శ్రీనివాసులు, డీఈ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హెడ్ పోస్టుమాస్టర్ శ్రీనివాసరెడ్డి పోస్టుమాస్టార్లు రాంబాబు, గౌతమ్, సిబ్బంది రమణ, సూర్యనారాయణ తదితరులు గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. పట్టణ బీజేపీ నేతృత్వంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు.

కె.గంగవరం: మండల వ్యాప్తంగా సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. కె.గంగవరం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కోటి నరసమ్మ గాంధీ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన జయంతి ఉత్సవాల్లో ఎంపీపీ పంపన నాగమణి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలు వేశారు. పాణింగపల్లి, అద్దంపల్లి గ్రామాల్లో జరిగిన వేడుకల్లో వైస్ ఎంపీపీలు సీతిపూడి మధుబాల, దూడల చినబాబు పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుందూరులో ఎంపీపీ పంపన నాగమణి, మాజీ జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, సర్పంచ్ పంపన సత్యానందం తదితరులు పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాజులూరు: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని గ్రామాల అభివృద్ధితోనే దేశం పురోగతి సాధిస్తుందన్న జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను నాయకులు ఆదర్శంగా తీసుకుని గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని వైఎస్సార్ సీపీ నేత, వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ అన్నారు. బుధవారం మండల గ్రామాల్లో నాయకులు మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అయితపూడిలో వైస్ ఎంపీపీ పెద్దిరెడ్డి వెంకటరమణ, కుయ్యేరులో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించగా, ఉప్పుమిల్లిలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వరద శేషారావు గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో భాగంగా పలు గ్రామాల్లో బీజేపీ నేతలు స్వచ్ఛ భారత్ నిర్వహించి పరిసరాలను శుభ్రం చేశారు.

గాంధీ మార్గం అనుసరణీయం

రాయవరం: జాతిపిత మహాత్మా గాంధీని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని రాయవరం జెడ్పీటీసీ సభ్యులు నల్లమిల్లి మంగతాయారు అన్నారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అలాగే పంచాయతీ కార్యాలయం, బస్టాండ్ సెంటర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఎంఈఓ పి.రామలక్ష్మణమూర్తి, కార్యాలయ ఏఓ డి.శ్రీనివాస్, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ జె.సుధారాణి, డ్వాక్రా ఏపీఎం నాజర్‌హుస్సేన్ పాల్గొన్నారు. సోమేశ్వరం బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పేకేటి ఈశ్వరరరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ జోడా గణేష్ తదితరులు పూలమాలలు వేశారు.

మండపేట: గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రిలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు అన్నారు. ఏడిద రోడ్డులోని కాంగ్రెస్ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. బీజేపీ ప్రభుత్వానికి నిరసనగా మండపేటలో బస్టాండ్ వద్ద గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. నాయకులు కె.అమ్మినీడు చౌదరి, గంధ్రోతుల రామచంద్రరావు, పర్వతిన వీరవెంకట సత్యనారాయణ, పాడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లోని సచివాలయాల వద్ద గ్రామ సభలను నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. ఆయా కార్యాలయాల అధికారులు గాంధీకి నివాళి అర్పించారు.

పశు పోషణలో జాగ్రత్తలు అవసరం



పసలపూడిలో పాడి రైతులకు మందులు అందజేస్తున్న వైద్యులు

రాయవరం: పసలపూడిలో బుధవారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో మండపేట పశు సంవర్ధక శిక్షణా కేంద్రం సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ కడలి పద్మావతి ప్రారంభించారు. పశు సంవర్ధక శిక్షణా కేంద్రం జేడీ డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు, ఉప సంచాలకులు నాగేశ్వరరావు, అమలాపురం సహాయ సంచాలకులు ఒ.రామకృష్ణ, రామచంద్రపురం ఏడీ వీజీఎస్ వరప్రసాద్‌లు హాజరై వైద్య సేవలు అందించారు. పశు పోషణలో పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఇందులో 50 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి, మందులు అందజేశారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



సోమేశ్వరంలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మండపేటలో అవార్డులు అందుకుంటున్న పారిశుధ్య కార్మికులు

మండపేట: పట్టణాన్ని శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ అన్నారు. మండపేటలో స్వచ్ఛతా హి సేవలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా కమిషనర్ రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో రాధాకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికులదే కీలకపాత్ర అన్నారు. ఈ పదిహేను రోజులుగా మరింత కష్టపడి పనిచేశారని కొనియాడారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన కార్మికులను సత్కరించి అవార్డులను అందించారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, డీఈ కె.శ్రీనివాస్, ఏఈ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: గత నెల 17న ప్రారంభమైన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. పక్షం రోజుల పాటు రోజుకొక కార్యక్రమం చొప్పున నిర్వహించగా, గాంధీ జయంతి రోజున శుభ్రతా దినోత్సవం సందర్భంగా గ్రామ సభలను చేపట్టారు. మండలంలోని రాయవరం, వెదురుపాక, వి.సావరం, నదురుబాద, పసలపూడి, సోమేశ్వరం, లొల్ల, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మండలంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పునః ప్రారంభించామన్నారు. ఇకపై తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరే విధంగా చర్యలు చేపడతామన్నారు. స్వచ్ఛతా హి సేవా ముగింపు సందర్భంగా పలు పంచాయతీ పారిశుధ్య కార్మికులను సత్కరించారు. ఉత్తమ సేవలు అందించిన పారిశుధ్య కార్మికులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

మానసిక రుగ్మతలతో మానవాళి తిరోగమనం



పడమర ఖండ్రికలో అనాలయోగిని అభినందిస్తున్న కమిటీ సభ్యులు

కపిలేశ్వరపురం: ఆధునికత పేరుతో ఏర్పడిన మానసిక రుగ్మతలే యావత్ మానవాళి తిరోగమనానికి ప్రధాన కారణమని ఉండ్రాజవరం బౌద్ధ దమ్మ పీఠాధిపతి అనాలయ బుద్ధ అన్నారు. మండలంలోని పడమర ఖండ్రికలోని ఉయ్యాల జంపాల దైవ క్షేత్రం వద్ద బుధవారం నూతనంగా నిర్మించిన పిరమిడ్ ధ్యాన మందిరం ప్రారంభోత్సవంలో ప్రసంగించారు. మందిరం ఆవరణలోని బుద్ధుని విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ధ్యాన మందిరాన్ని వైజాగ్‌కు చెందిన ప్రకృతి వ్యాలీ అధినేత దాట్ల రాయిజగపతిరాజు ప్రారంభించారు. గ్రంథాలయాన్ని నల్లమిల్లి అన్నపూర్ణ, విజయ భాస్కరరెడ్డి ప్రారంభించారు. స్థానిక పిరమిడ్ ధ్యాన మందిరం ద్వారా ధ్యాన ప్రచార కార్యక్రమాలు ఉధృతమవుతాయని ఆశాభావాన్ని అనాలయ బుద్ధ వ్యక్తం చేశారు. ప్రతి జీవికి భౌతిక, మానసిక ధర్మాలు నియమితమై ఉంటాయని, అందులో మానవ ఆహార ధర్మాన్ని ప్రతి ఒక్కరూ విధిగా ఆచరించాలని ఉపదేశించారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల సమీప ప్రాంతాల్లో జరుగుతున్న పిరమిడ్ ధ్యాన కార్యకలాపాలను వల్లూరి వీర వెంకట సత్యనారాయణ చౌదరి, చీకట్ల రమణ వివరించారు. ఇరు గ్రామాల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు ముస్తాబైన ఆలయాలు



గొల్లపాలెంలో విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన దుర్గాదేవి ఆలయం

కాజులూరు: మండల గ్రామాల్లో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు. దుర్గాదేవి ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి ఆలయాల ఎదుట చలువ పందిళ్లు వేశారు. ఆలయాలు లేని పలు గ్రామాల్లో సైతం ప్రధాన కూడళ్లలో తాటాకు పందిళ్లతో మంటపాలను నిర్మించి భక్తులు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సుందరంగా చూపరులను ఆకర్షించే విధంగా పోటాపోటీగా ఆలయాలు అలంకరించబడ్డాయి. ఉదయం, సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అక్టోబర్ 12వ తేదీ శనివారం విజయదశమి అనంతరం నవరాత్ర మహోత్సవాలకు భక్తులు ఉద్వాసన చెబుతారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో భక్తులు భవానీ దీక్షలు ప్రారంభించారు. ప్రతి రోజు పూజా కార్యక్రమాలతో పాటు ఆలయాల్లో రోజుకో విధంగా ప్రత్యేక హోమాలు, లక్షపత్రి పూజలు, లక్ష కుంకుమార్చనలు నిర్వహిస్తుంటారు. ఆలయాల వద్ద తొమ్మిది రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి దసరా మహోత్సవాలు

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఏర్పాట్లు



ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారు

రామచంద్రపురం రూరల్: అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో నేటి నుంచి దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని విలేకరులకు తెలిపారు. నేటి ఉదయం 6.53 గంటలకు కలశ స్థాపనతో దసరా మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఆలయ చరిత్రలో తొలిసారిగా గత ఏడాది అమ్మవారిని దసరా మహోత్సవాల్లో భాగంగా విశేష అలంకరణలు చేయగా ఈ ఏడాదీ అమ్మవారికి విశేష అలంకరణలు చేయనున్నారు. అయితే మూల విరాట్ అమ్మవారికి కాకుండా ప్రత్యేకంగా అమ్మవారి మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆ విగ్రహానికి విశేష అలంకరణలు చేయనున్నట్లు ఈఓ తెలిపారు.

ఈ ఏడాది ప్రత్యేకత.. అమ్మవారి అవతారాలు..

ఈ నెల 3న రాజరాజేశ్వరిదేవిగా, 4న బాలాత్రిపుర సుందరీదేవిగా, 5న అన్నపూర్ణాదేవిగా, 6న గాయత్రీ దేవిగా, 7న కాళికా దేవిగా, 8న సరస్వతీ దేవిగా, 9న లక్ష్మీదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసురమర్దినిగా, 12న విజయదుర్గాదేవిగా అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేయనున్నారు.

మండలానికి స్వచ్ఛతా హి సేవ పురస్కారాలు



జేసీ నిషాంతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకుంటున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు

రామచంద్రపురం రూరల్: ఇటీవల నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను పురస్కరించుకుని జిల్లా జేసీ నిషాంతి చేతుల మీదుగా మండలానికి చెందిన ముగ్గురు పురస్కారాలు అందుకున్నారు. వీరిలో ఉండూరు సర్పంచ్ చిగురుపాటి రామలక్ష్మి, ద్రాక్షారామ పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, వెల్ల పారిశుధ్య కార్మికుడు గురజా నాగేశ్వరరావులు ఈ పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.షెలత్‌రాజు, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాల్గొన్నారు. వీరిని జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు సరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం



సుబ్బయ్య

కపిలేశ్వరపురం: కాలేరు గ్రామానికి చెందిన యరమాటి సుబ్బయ్య (తాతరాజు) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.రవికుమార్ బుధవారం తెలిపారు. గత నెల 27న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి రాలేదు. దీనిపై అతని సోదరుడు జాన్‌ప్రసాద్ అంగర పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించగా, కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.